వాడివేడిగా మహేశ్వరం సమావేశం

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జనవరి 27: మహేశ్వరం సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. మహేశ్వరం ఎంపీపీ సునీతా ఆంధ్యానాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎజెండాలో ఉన్న 23 అంశాలపై చర్చించారు. రైతుల బావుల వద్ద గడ్డి కటింగ్ యంత్రాలు ఉండటంతో అధికారులు మీటర్లు పెట్టుకోవాలని సూచించడంతో సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో రైతులకు ఇచ్చిన విధంగానే కరెంటు ఇవ్వాలని సభ్యులు పట్టుబట్టారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొన్నది. రోజుకు నాలుగు గంటలు కరెంటు పోతుందని.. సాయంత్రం 6నుంచి రాత్రి 11గంటల వరకు సింగిల్ ఫేజ్ కరెంటు వస్తుందని అధికారులపై ఆరోపించారు. గడ్డి కటింగ్ చేసుకోవడానికి కమర్షియల్ మీటర్లు పెట్టుకోవాలని అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. గతంలో మహేశ్వరం మండల వ్యాప్తంగా మీటర్లు లేకుండా ఇటుక బట్టీలు నడుస్తుంటె ఎందుకు మీటర్లు పెట్టలేదని అధికారులను సభ్యులు నిలదీశారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ప్రభుత్వ భూములు కబ్జా అవుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని తాసీల్దార్ మహమూద్ అలీపై ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వ భూముల నుంచి ఇష్టానుసారంగా మట్టి తరలిస్తుంటే అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పీవోటీ కింద భూములను తీసుకోవాలన్నారు. చెరువు కుంటలు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను సర్వే చేయించాలన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి సరిహద్దులను గుర్తించి ఎఫ్‌టీఎల్‌ను ఫిక్స్ చేయాలన్నారు. కబ్జాదారులు ఎంతటివారైనా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆరు గ్యారంటీల అమలెప్పుడో..

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని.. ఆరు గ్యారంటీలకే గ్యారంటీ లేదని ఎద్దేవా చేశారు. వారం రోజుల పాటు ప్రజలను క్యూ లైన్లలో నిలబెట్టి తీసుకున్న దరఖాస్తులు ఎక్కడ వేశారో తెలియదన్నారు. ఆరు గ్యారంటీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన అధికారులు రేషన్ కార్డు దరఖాస్తులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అందుకు తాసీల్దార్ స్పందిస్తూ ప్రభుత్వం నుంచి రేషన్ కార్డుల కోసం గైడ్ లైన్స్ రాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండీవో నర్సింహ, ఎంఈవో డి.కృష్ణయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ పాండు, డీఈఈ, ఏఈ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ

బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ రవికుమార్

వనస్థలిపురం, జనవరి 27: వనస్థలిపురం పోలీస్ స్టేషన్ నూతన సీఐగా రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న జలంధర్‌రెడ్డి 10రోజుల క్రితం బదిలీపై మల్టిజోన్‌కు వెళ్లిన విషయం విధితమే. అప్పటినుంచి స్టేషన్ డీఐగా పనిచేస్తున్న వెంకట్ తాత్కాలికంగా విధులు నిర్వహించారు. స్పెషల్ బ్రాంచిలో విధులు నిర్వహిస్తున్న రవికుమార్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఆయన శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు ఆహ్వానం పలికారు.

సీఐ విష్ణువిర్ధన్‌రెడ్డి బదిలీ

విష్ణువర్ధన్‌రెడ్డి

కందుకూరు, జనవరి 27 : కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డిని స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. సీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ముగ్బుల్ జానీని కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐగా నియమిస్తూ రాచకొండ సీపీ సుధీర్ బాబు ఆదేశాలు జారీ చేశారు.

జిల్లా ఉత్తమ ఎంపీడీవోకు సన్మానం

ఆమనగల్లు, జనవరి 27 : ఇటీవల జిల్లా ఉత్తమ ఎంపీడీవోగా ఎంపికైన ఆమనగల్లు ఎంపీడీవో ఫారుక్ హుస్సేన్‌ను శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆమనగల్లు మున్సిపాలి టీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు నిట్టనారాయణ, మంగళపల్లి సర్పంచ్ నర్సింహారెడ్డి, తిరుపతయ్యగౌడ్ ఘనంగా సన్మానించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

చైతన్యపురి డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా తదితరులు

ఎల్బీనగర్, జనవరి 27: కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా సూచించారు. శనివారం చైతన్యపురి డివిజన్‌లోని ఇందిరానగర్, భవానీనగర్, బాబు కాంప్లెక్స్ ప్రాంతాల్లో రూ.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన రోడ్లు, యూజీడీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ రవీందర్‌రెడ్డి, సాయికుమార్, సురేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బీఎన్‌రెడ్డినగర్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జనవరి 27: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం పలు కాలనీల్లో పర్యటించి పారిశుధ్య పనుల తీరును పరిశీలించారు. సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చూసుకోవాలన్నారు. పోగేసిన చెత్తను తగలపెట్టవద్దన్నారు. ఆటో, రిక్షాల్లో చెత్తను తరలించాలన్నారు. ఇంట్లో వచ్చే చెత్తను డబ్బాల్లో నిల్వచేసి తరలించాలని ప్రజలను కోరారు. చెత్త పేరుకుపోతే దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రభలే ప్రమాదముందన్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అదనంగా 18 కిలోమీటర్ల పైపులైన్

జలమండలి ఎండీని కలిసిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని కలిసి చర్చిస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, జనవరి 27: ఎల్బీనగర్ నియోజకవర్గంలో నూతన తాగునీటి పైపులైన్ నిర్మాణం కోసం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శనివారం జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో 80 కిలోమీటర్ల మేర నూతన వాటర్‌లైన్లు మంజూరు చేయడం జరిగిందని, దానికి అదనంగా మరో 18 కిలోమీటర్ల వాటర్ లైన్ మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని శివారు కాలనీల్లో నూతనంగా యూజీడీ లైన్లు వేసేందుకు రూ.40కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంపై జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖను కలిసిన మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి

కందుకూరు, జనవరి 27 : అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ తెలిపారు. మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి శనివారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అదే విధంగా పులిమామిడి చీకటి వేంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను కలిసి వినతి పత్రాలు అందజేశారు. అలాగే జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబును కలిసి దెబ్బడగూడ గ్రామంలో అభివృద్ధి పనులను శంకుస్థాపన చేయాల్సిందిగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు అందుగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

వికాస భారతి హైస్కూల్ సైన్స్ ఫెయిర్‌లో తమ ఎగ్జిబిట్స్‌ను వివరిస్తున్న విద్యార్థులు

సైదాబాద్, జనవరి 27: సైదాబాద్ వికాస భారతి హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్-2024 పలువురిని విశేషంగా ఆకట్టుకున్నది. పాఠశాల విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిట్స్ ఎంతోగాను ఆకర్షించాయి. తమదైన శైలిలో అనేక అంశాలకు సంబంధించిన ఎగ్జిబిట్స్ అనేక సందేహాలను తీర్చే విధంగా కనిపించాయి. విద్యార్థులు 90 ఎగ్జిబిట్లను తయారు చేసి తమ ఎగ్జిబిట్స్ యొక్క ప్రాధాన్యత సైన్ ఫెయిర్‌కు తెలికించేందుకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు, వివిధ పాఠశాలల విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ యోగేశ్వరరావు, ప్రిన్సిపాల్ భరణికుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



కాలనీలో సమస్యలపై చర్చిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, జనవరి 27: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి తెలిపారు. శనివారం మార్నింగ్ వాక్‌లో భాగంగా హయత్‌నగర్ డివిజన్‌లోని హైకోర్టు కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా సత్వరమే పరిష్కరించాలని జలమండలి మేనేజర్ వాహినితో ఫోన్‌లో చర్చించారు. ఆయన వెంట కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, మురళీకృష్ణ, రాజు, తదితరులు ఉన్నారు.

ఎలక్ట్రిషన్ సంఘం బలోపేతం చేయడానికి కృషి చేయాలి

కందుకూరులో జెండాను ఆవిష్కరిస్తున్న ఎలక్ట్రిషన్ సంఘం నాయకులు

కందుకూరు, జనవరి 27 : ఎలక్ట్రిషన్ సంఘం బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ్రపల్లి జగన్ తెలిపారు. మహేశ్వరం, కందుకూరు మండలాలకు చెందిన సంఘం నాయకులు ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా మండల కేంద్రంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రీషియన్‌లు అందరూ సభ్యత్వం తీసుకోవాలని.. దీంతో అనుకోని సంఘటన జరిగితే రూ.10లక్షల ఇన్యూరెన్స్ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గాదె సత్తయ్య, కార్యదర్శి జాజుల రవి, మండల కోశాధికారి గాదె కుమార్, గాదె చెన్నయ్య, యాదిరెడ్డి, కమిటీ సభ్యులు సంజయ్ రాథోడ్, ప్రవీణ్, సాయికిరణ్, వినోద్, శ్రీకాంత్, రాజు, రామస్వామి, గాదె శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

కడ్తాల్, జనవరి 27: సమష్టి కృషితోనే గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గడిచిన ఐదేండ్లలో గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, గ్రామ పంచాయతీ ఆదాయ, వ్యయాలను సర్పంచ్ వివరించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో పంచాయతీలు కార్మికులు కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఐదేండ్లుగా రాజకీయాలకతీతంగా సహకరించిన పాలక మండలి సభ్యులు, పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. ఈ నెల 30న నిర్వహించనున్న ప్రత్యేక గ్రామసభలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యుత్ అంతరాయం లేకుండా మరమ్మతులు

మరమ్మతు పనులు పరిశీలిస్తున్న డీఈ కేకే రామకృష్ణ

ఆర్కేపురం, జనవరి 27 : అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ సబ్ స్టేషన్ల వార్షిక మరమ్మతుల్లో భాగంగా శనివారం 33/11కేవీ నాగోల్, మారుతినగర్ సబ్‌స్టేషన్లు వాటికి అనుగుణంగా ఉన్న 11కేవీ లైన్లు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులను సరూర్‌నగర్ ఆపరేషన్ డివిజన్ ఇంజినీర్ కేకే రామకృష్ణ, లైన్స్ డివిజనల్ ఇంజినీర్ బి.సంగమేశ్వర, ఏడీలు తిరుపతయ్య, ప్రభాకర్, బాల్యనాయక్, ఏఈలు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, జనవరి 27 : ఆటోనగర్ ఇండస్ట్రియల్, ధీర్‌పార్కు 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్‌నగర్ విద్యుత్‌శాఖ డీఈ కేకే రామకృష్ణ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జనవరి 27: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డీఈఈ హనుమంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ దోబీఘాట్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11కేవీ సమత కాలేజ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పలు కాలనీల్లో నూతన కార్యవర్గం ఎన్నిక

సీఎస్ఆర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మన్సూరాబాద్, జనవరి 27: హయత్‌నగర్ పరిధి సీఎస్ఆర్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెంగ సత్తిపండు, గౌరవ అధ్యక్షుడిగా ముత్యాల రాజశేఖర్‌రావు, ఉపాధ్యక్షుడిగా సుర్వి శ్రీనివాస్‌గౌడ్, ప్రధానకార్యదర్శిగా గుండెబోయిన లింగయ్యయాదవ్, కోశాధికారిగా పల్లె గోపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా బి. సతీశ్‌యాదవ్, డి.నాగార్జున, ఎం.రజనీకాంత్ గౌడ్, గౌరవ సలహాదారులుగా శ్రీపాద సత్యనారాయణ చారి, తడిసిన ఉపేందర్‌రెడ్డి, ముచ్చ రవీంద్‌రావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గంగనబోయిన యాదయ్య, గోపగాని శ్రీనివాస్‌గౌడ్, బాణాల రామాచారి, తీగల రమేశ్, రాసమల్ల శ్రీనివాస్, కార్యవర్గసభ్యులుగా ఎర్ర శ్రీనివాస్, ఎస్ఆర్ శ్రీధర్‌చారి, వెలిజాల కిరణ్, జి.దుర్గయ్య, డి.కమలాసన్, పి.ఆంజనేయులు, గంజి శ్రీనాథ్, ఎలిమినేటి మోహన్ రెడ్డి, అనిల్‌కుమార్‌గౌడ్, బి.వేణుగోపాల్‌రెడ్డి, పి.కృష్ణయ్య, సీహెచ్ అశోక్ నియమితులయ్యారు.

దుర్గాభవాని నగర్...



దుర్గాభవాని నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం దృశ్యం

చంపాపేట, జనవరి 27: చంపాపేట డివిజన్ పరిధిలోని దుర్గాభవాని నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లట్టుపల్లి రమేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆకుతోట వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎలిమినేటి నిషీకాంత్‌రెడ్డి, సహాయ కార్యదర్శి గుడిదేవుని రాజేందర్ గౌడ్, కోశాధికారి నాగేశ్వర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పన్నాల ఓమ్‌రెడ్డి, లీగల్ అడ్వైజర్ వద్యాల శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు.

అనంతుల జంగారెడ్డి కాలనీలో..

నూతనంగా ఎన్నికైన అనంతుల జంగారెడ్డి కాలనీ అధ్యక్షుడు పార్నంద భాస్కర్

మన్సూరాబాద్, జనవరి 27: నాగోల్ డివిజన్ పరిధి అనంతుల జంగారెడ్డి కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పార్నంది భాస్కర్, కార్యదర్శిగా వై.రాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం.సాయికిరణ్, ఉప కార్యదర్శిగా డి.నర్సింహారావు, కోశాధికారిగా డి.ప్రభాకర్, కార్యవర్గసభ్యులుగా ఎన్.వెంకన్నగౌడ్, వి.శ్రీనివాస్‌గుప్తా నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పార్నంది భాస్కర్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరింపజేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చావునీలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల తదితరులు

సైదాబాద్, జనవరి 27: పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతోగాను దోహదపడుతాయని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. శనివారం చావునీ డివిజన్ పరిధిలోని మదీనా మసీదు వద్ద ప్రభుత్వ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పలువురికి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అదే విధంగా అనేమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రక్తహీనత పరీక్షలకు నిర్వహించి.. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చావునీ కార్పొరేటర్ సలాం షాహిద్, డీఎంహెచ్‌వో బిర్జున్నీసా, వైద్యులు, ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్య కీలకం

సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థినులు

ఆర్కేపురం, జనవరి 27 : విద్యార్థి దశలో ఇంటర్ విద్య కీలమని, విద్యార్థినులు కష్టపడి చదివితే తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని శివాని మహిళా కళాశాల చైర్మన్ డా.రామ్‌రెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ వేదిరే సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం కొత్తపేట శివాని మహిళా జూనియర్ కళాశాల వార్షికోత్సవాలు కొత్తపేటలోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవితానికి ఉపయోగపడే వాటి పట్ల విద్యార్థినులు ఏకాగ్రత, మనసు పెట్టి నేర్చుకోవాలని సూచించారు. ప్రపంచ దేశాల్లో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. అనుకున్నది సాధించే వరకు లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రేమ్‌నాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

చర్లపల్లి, జనవరి 27: నియోజకవర్గ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలో శివనగర్ సంక్షేమ సంఘం నూతన భవనాన్ని స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా శివనగర్ కాలనీలలో రహదారుల నిర్మాణం, తాగునీటి, డ్రైనేజీ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తున్నామని ఆయన తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డివిజన్‌లో సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, మహేశ్‌గౌడ్,కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

ఉప్పల్, జనవరి 27: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి ఎం. పరమేశ్వర్‌రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను శనివారం కలిశారు. నియోజకవర్గంలోని సమస్యలు, పరిష్కారానికి చేపట్టాల్సిన పనులు, కేటాయించాల్సిన నిధులపై వినతిపత్రం అందజేశారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

PUBLIC NOTICE

This is to inform the general public that **A.Sandhya Rani** is purchasing Portion of House No.3-5-187(New), (Old No. 3-5-100), land admeasuring 124 Sq.yds., Situated at Bahadurguda Village, Saroornagar Mandal, Ranga Reddy District from **K.Pradeep Reddy,** who acquired the same vide Registered Release Deed No. 6233/2023 dated 13-10-2023. Whosoever has got any claims or rights over the above mentioned property. Please contact J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 10 days from date of publication of this notice.